క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

గండేడ్‌: మండలంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కుల పంపిణీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌ నాగలక్ష్మి తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2గంటలకు రెడ్డిపల్లిలో నూతన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

విశ్రాంత తహసీల్దార్‌ మృతికి సంతాపం

మహబూబ్‌నగర్‌ రూరల్‌: అర్బన్‌ మండల విశ్రాంత తహసీల్దార్‌ ఎంపీ ప్రభాకర్‌రావు శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ప్రస్తుత రంగారెడ్డి జిల్లాలోని చౌదరిగూడెం మండలానికి చెందిన ప్రభాకర్‌రావు వృత్తిరీత్యా చాలాకాలం మహబూబ్‌నగర్‌లోనే స్థిరపడి ఉద్యోగ సంఘం నేతగా గుర్తింపు పొందారు. ఆయనకు పలువురు నివాళి అర్పించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల: కన్మనూర్‌కి చెందిన బీఆర్‌ఎస్‌ యువజన విభాగం అధ్యక్షుడు గుంటి శ్రీనివాసులు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని పార్టీ శ్రేణుల ద్వారా అందజేయించారు. అదేవిధంగా అడ్డాకుల జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి రూ.10వేలు పంపారు. పెద్దమందడి జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు వేణుయాదవ్‌, భీంరెడ్డి, గణేష్‌, దయాకర్‌, శ్రీధర్‌, రాజవర్ధన్‌రెడ్డి, సురేష్‌, రఘువర్ధన్‌ తదితరులు ఉన్నారు.

కంప్యూటరీకరణ ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఆదివారం కంప్యూటరీకరణను ప్రారంభించామని ఎంపీడీఓ జయరాములు తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రతి దరఖాస్తును కంప్యూటరీకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీఓ నజీర్‌అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలి

గండేడ్‌: విద్యార్థుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని గండేడ్‌ సర్పంచ్‌ చంద్రకళ, బీసీ హాస్టల్‌ వార్డెన్‌ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు దుస్తులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

గండేడ్‌: విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని హస్నాబాద్‌ వెంకటయ్య జేఎఫ్‌ రకం జెర్సీ ఆవును రూ. 80 వేలకు కొని దానిమీదే ఆధారపడి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం జంగంరెడ్డిపల్లి సమీపంలోని పంట పొలాల్లో మేపుతుండగా ప్రమాద వశాత్తు ఆవుకు విద్యుత్‌ వైరు తగిలింది. చుట్టూ ఏపుగా గడ్డి పెరిగి ఉన్నచోట ట్రాన్స్‌ఫార్మర్‌ ఉండడం.. దిమ్మె కిందికి ఉండి హెచ్‌టీ లైను కూడా ఉండడంతో ఘటన జరిగింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. కాగా తాను ఉపాధి కోల్పోయానని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వెంకటయ్య కోరారు.

హైవే.. సమస్యలు తీరవే..?


జానంపేట వద్ద ప్రధాన రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు


వేముల స్టేజీ వద్ద అండర్‌ బ్రిడ్జి నిర్మించాల్సిన బ్లాక్‌ స్పాట్‌

- ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగులు
- అవసరమైన చోట బ్రిడ్జీలు లేక ఇబ్బందులు
- అసంపూర్తిగా సర్వీస్‌ రోడ్లు
- బాలానగర్‌ ఘటన నేపథ్యంలో ప్రయాణికుల్లో ఆందోళన

అడ్డాకుల: మండలం మీదుగా పోతున్న 44వ నంబర్‌ జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఏదో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తున్నా సంబంధిత రోడ్డు నిర్వాహకులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాలానగర్‌ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తర్వాతైనా నిర్వాహకులు మేల్కోవాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అలాంటి ఘటనలు మరిన్ని జరగకముందే అవసరమైన చోట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. జాతీయ రహదారిపై జడ్చర్ల నుంచి కొత్తకోట వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌ స్పాట్లను అధికారులు గుర్తించినా వాటి వద్ద చేపడుతున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. ప్రధాన కూడళ్ల వద్ద అండర్‌ బ్రిడ్జీలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చౌరస్తాల వద్ద ప్రయాణీకులు బస్సుల కోసం ప్రధాన రహదారిపై వేచి ఉండటం...అదే సమయంలో యూటర్న్‌ తీసుకునే వాహనాలు, రహదారిపై నేరుగా వెళ్లే వాహనాలతో ఆ ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయి. హైవే ఆరు లైన్లుగా విస్తరించే పనులు చేపట్టే వరకు అండర్‌ బ్రిడ్జిల పనులు కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

ప్రధాన సమస్యలివే..!

- అడ్డాకుల మండలం బలీదుపల్లి స్టేజీ వద్ద రహదారిపై యూటర్న్‌ను మూసి వేశారు. ఇక్కడ వెల్టూర్‌ స్టేజీ వరకు ఉన్న సర్వీస్‌ రోడ్డు బాగోలేకపోవడంతో వాహనాలు రాంగ్‌రూట్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణీకులకు ప్రమాదం పొంచి ఉంది.
- కాటవరం, గుడిబండ, కందూర్‌ స్టేజీల వద్ద అండర్‌ బ్రిడ్జీలు లేవు. వాహనాలు ప్రధాన రోడ్డుపైనే క్రాసింగ్‌ చేయటం వల్ల తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- శాఖాపూర్‌ వద్ద టోల్‌ప్లాజా వైపు యూటర్న్‌ను మూసి వేశారు. అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌ రోడ్డుపై రాకపోకలను ప్రారంభించారు. బస్సులు, ఆటోలను ప్రధాన రోడ్డుపై నిలపకుండా సర్వీస్‌ రోడ్డుపై వెళ్లేలా చేయాలి. సర్వీస్‌ రోడ్డును పూర్తి స్థాయిలో బాగు చేయాల్సి ఉంది.
- మూసాపేట మండలం వేముల స్టేజీని బ్లాక్‌ స్పాట్‌గా గుర్తించారు. ఇక్కడ వేములకు వెళ్లే వాహనాలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అండర్‌ బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.
- మూసాపేట స్టేజీ వద్ద కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ బస్సులు, ఆటోలు గ్రామంలోకి వెళ్లి వచ్చే క్రమంలో రోడ్డు క్రాసింగ్‌ డేంజర్‌గా మారుతోంది.
- అచ్చాయపల్లి స్టేజీ వద్ద రోడ్డు క్రాసింగ్‌ లేదు. జానంపేట నుంచి రాంగ్‌రూట్లో వెళ్తున్నారు. జానంపేట బడికి వెళ్లే విద్యార్థులు ప్రధాన రోడ్డుపైనే నడుస్తున్నారు. ఇక్కడ సర్వీస్‌ రోడ్డును జానంపేట వరకు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.
- జానంపేట వద్ద రెండు వైపులా ప్రధాన రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. ప్రయాణీకులు అక్కడే నిలబడటంతో ప్రమాదం పొంచి ఉంది.
- పోల్కంపల్లి స్టేజీ వద్ద రద్దీ ఎక్కువవుతోంది. తాటికొండ మీదుగా వచ్చే వాహనాలు రోడ్డు దాటేటప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సర్వీస్‌ రోడ్డును బాగు చేయాలి



మా ఊరి స్టేజీ నుంచి వెల్టూర్‌ స్టేజీ వరకు సర్వీస్‌ రోడ్డు అందుబాటులో లేదు. ఇక్కడ రోడ్డు క్రాసింగ్‌ను మూసి వేయడంతో రాంగ్‌రూట్లో వెళ్తున్నారు. రాత్రిపూట ఇబ్బందిగా ఉంది. సర్వీస్‌ రోడ్డును బాగు చేయించాలి.

వేణుయాదవ్‌, బలీదుపల్లి

అండర్‌ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



హైవే వద్ద అండర్‌ బ్రిడ్జి లేదు. ఊర్లోకి వచ్చి పోయే వాహనాలు రోడ్డు దాటేటప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. అండర్‌ బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుంది.

–సుధాకర్‌, మూసాపేట

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించి రాణించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డోకూర్‌లో ప్రేమ్‌కుమార్‌, సంపత్‌కుమార్‌ స్మారక క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామ స్థాయిలో టోర్నమెంట్‌లను నిర్వహించడం వల్ల క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసే అవకాశం ఉంటుందన్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, సర్పంచ్‌ రామకృష్ణారెడ్డి, నాయకులు భీంరెడ్డి, వర్మ, బుచ్చన్న టోర్నమెంట్‌ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

యాభా దర్గా ఉర్సు ప్రారంభం


ముస్తాబైన యాభా దర్గా

జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్‌ ఎదురుగా ఉన్న హజ్రత్‌ ఖాజా అబ్దుల్లా బిన్‌ సిద్దిఖ్‌ చిస్తి (యాభా) దర్గా 52వ ఉర్సు ఉత్సవాలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు దర్గాను శుద్ధిచేసి అలంకరించి ఫాతేహాలు నివేదించారు. దర్గా పీఠాధిపతి కిజర్‌ బిన్‌ హస్సన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో సోమవారం సాయంత్రం 4గంటలకు గంధోత్సవం (సందల్‌ షరీఫ్‌) నిర్వహించనున్నారు. పాతబజార్‌ అబ్దుల్‌ కలాం కాలనీలో ఉన్న పీఠాధిపతి నివాసం నుంచి గంధం ఊరేగింపు ప్రారంభం కానుంది. గంధోత్సవం అనంతరం దర్గాలో అన్నదానం చేయనున్నారు. మంగళవారం దీపారాధన, బుధవారం ఖత్మె ఖురాన్‌పఠనంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భక్తులు తరలివస్తుంటారని నిర్వాహకులు తెలిపారు.

అంతరాలు లేని విద్య అవసరం


నివాళి అర్పిస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: అందరికి సమానంగా.. అంతరాలు లేని విద్య అవసరం అని, పేదలకు విద్యను దూరం చేయొద్దని టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్‌, రవి కుమార్‌ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్‌ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే జయంతి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సావిత్రిబాయి పూలే మహిళల హక్కుల కోసం, పేదల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. విద్యను ప్రభుత్వం ప్రైవేటీకరించే క్రమంలో పేదలు విద్యకు దూరం అవుతున్నారని, పేదరికం మరింత పెరగనుందన్నారు. నాయకులు హేమలత, సృజన, శ్రీనివాసులు, శివరాజ్‌, అజయ్‌, జయంతి, జావెద్‌, నాగవేణి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెంపర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ పథకాలలో ఇప్పటికే రెండు ప్రవేశపెట్టామని, త్వరలోనే మిగతా వాటిని అమలు చేస్తామని.. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని పేట ఎమ్మెల్యే చిట్టెంపర్ణికారెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిపల్లిలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం సూరారంలో ఏర్పాటు చేసిన క్రికెట్‌ టోర్నమెంటును ప్రారంభించారు. సర్పంచ్‌ కరుణాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి.రవీందర్‌, జగన్‌గౌడ్‌, విఠల్‌, ఖాజనవాస్‌, గౌస్‌, సత్యపాల్‌రెడ్డి, రామస్వామి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌ శిక్షణతో మహిళలకు ఉపాధి


కుట్టుమిషన్లను మహిళలకు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌లో మూడు నెలలుగా రైస్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్‌ వే సహకారంతో చేపట్టిన ఉచిత కుట్టుమిషన్‌ శిక్షణతో మహిళలకు ఉపాధి చేకూరుతుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అమరేందర్‌గౌడ్‌, సభ్యులు రవీందర్‌రెడ్డి అన్నారు. మూడు నెలల నుంచి 30మంది నిరుపేద మహిళలకు ఉచితంగా శిక్షణను ఇవ్వడంతోపాటు రూ.15వేల విలువ గల కుట్టుమిషన్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఆంజనేయులు, ఆసంస్థ సభ్యులు నరేష్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్ట్‌ గ్రేడింగ్‌ పరీక్షలు


విద్యార్థులతో మాస్టర్లు

మహబూబ్‌నగర్‌ (క్రీడలు): జిల్లా కేంద్రంలోని డైట్‌ కళాశాల ఆవరణలో ఆదివారం జీకే షోటోకాన్‌ కరాటే డూ ఇండియా సీనియర్‌ మాస్టర్‌ శివకుమార్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్‌ పరీక్షలు నిర్వహించారు. ఫౌండర్‌ జి.కృష్ణయ్య చీఫ్‌ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్‌ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. సీనియర్‌ మాస్టర్‌ శివకుమార్‌, పీపీ రఘుపతి, డాక్టర్‌ ఖాజామైనోద్దీన్‌, బాలకృష్ణ, రామాంజనేయులు, ఇన్‌స్ట్రక్టర్‌ శ్రీధర్‌, బ్లాక్‌ బెల్ట్‌ విద్యార్థులు అఖిలేశ్వర్‌రెడ్డి, పవన్‌, మహిమాన్విత, కళ్యాణ్‌ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న స్థానికులు


రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీ నగర్‌ట్రస్ట్‌ కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ఏకాదశి రుద్రాభిషేకం చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయస్వామికి అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, దక్షిణామూర్తి, నవగ్రహవిగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. వేడుకల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మనోహర్‌, లలిత, రామకృష్ణ, గోపెమ్మ, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌, ప్రభాకర్‌, సంజీవ్‌గురూజీతోపాటు సత్యసాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



నవాబుపేట: మండల కేంద్రంలోని శివాలయంలో అయ్యప్ప మాలాధారులు ఆదివారం ఇరుముడులు ధరించి శబరియాత్రకు బయలు దేరారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడంతో ప్రాంగణ మంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. సర్పంచ్‌ గోపాల్‌గౌడ్‌ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వెంకటేష్‌ గురుస్వామి, నర్సింహగౌడ్‌, రాజు, యాదయ్య, శివకుమార్‌ పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

దేవరకద్ర: మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. గతంలో ప్రకటించిన విధంగా 8న జరగాల్సిన సభను తిరిగి 17న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులను ఆన్‌లైన్‌ చేయడంలో అధికారులు నిమగ్నం అయినందున ప్రస్తుతం వాయిదా వేసినట్లు తెలిపారు.

రాముడి అక్షతల ఊరేగింపు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని గ్రామాల్లో ఆదివారం అయోధ్య రాముడి అక్షతలను ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. మూసాపేటలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఉన్న అక్షతలను నిజాలాపూర్‌ గ్రామస్తులు ఊరేగింపుగా తమ గ్రామానికి తీసుకెళ్లారు. అడ్డాకుల మండలంలోని గ్రామాల్లో అక్షతల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మహమ్మదాబాద్‌: చిన్ననాటి స్నేహం ఎంతో మధురమైనదని గురువులు పాండురంగారెడ్డి, కృష్ణయ్య తెలిపారు. మండలపరిధిలోని నంచర్ల ఉన్నత పాఠశాలలో 2006– 07లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయసమ్మేళనంలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్‌ఎస్‌ (1972 బ్యాచ్‌) విద్యార్థులు జేపీఎన్‌సీలో ఆదివారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సదానందంను ఘనంగా సన్మానించారు.

కార్మికుల సమస్యల పరిష్కరించాలి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: గ్రామ పంచాయతీ సిబ్బందికి సంబంధించి మల్టీ పర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సి.వెంకటేష్‌ అన్నారు. ఆదివారం హన్వాడలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో మండల జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దర్పల్లి బాలకిష్టయ్య, ఉపాధ్యక్షులుగా గంగపురి, చెన్నయ్య, వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శిగా తిమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా భీమయ్య, శ్రీను, బీ రాములు కోశాధికారిగా రంగయ్యను ఎన్నుకున్నారు.

'రాజకీయ దురుద్దేశంతో ఆత్మహత్య డ్రామా'

నవాబుపేట: కాంగ్రెస్‌పై రాజకీయ దురుద్దేశంతోనే దేపల్లి ఉపసర్పంచ్‌ భర్త దామోదర్‌ ఆత్మహత్య యత్నం డ్రామా చేశారని పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, నాయకుడు దేపల్లి వెంకటేష్‌ ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దామోదర్‌ ముందుగా గ్రామంలో చాలా మందికి చెప్పి.. ఆస్పత్రికి సమీపంలోకి వచ్చి ఆత్మహత్య యత్నం చేశాడని అన్నారు. కుటుంబ కలహాలే అతడి చర్యలకు కారణమని పేర్కొన్నారు. దేపల్లిలో దామోదర్‌ చేపట్టిన పనికి గాను గత ఏడాది అక్టోబర్‌లో రూ. 1 లక్ష పంచాయతీ ద్వారా అడ్వాన్సుగా తీసుకున్నాడని వివరించారు. అయినా ఆలస్యంగా జనవరి 2న పనులు చేపట్టి సగంలో వదిలేశాడని ఆరోపించారు. బిల్లు ఇవ్వకూడదని ఎవరూ చెప్పలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు సేవాభావంతో రాజకీయాలకు వచ్చారని అనవసర రాజకీయం చేసి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఘటనపై పోలీసులు విచారణ జరపాలని కోరారు. నాయకులు రమేష్‌గౌడ్‌, అజహర్‌, శ్రీహరి, మల్లేష్‌, రవి తదిరతులు పాల్గొన్నారు.

ఓపీ ప్రారంభించాలని డిమాండ్‌


ఆస్పత్రి పాతభవనం

- హోమియో క్లినిక్‌కే పరిమితమైన ఆస్పత్రి పాత భవనం
- నూతన భవనంకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసాలంటున్న స్థానికులు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చొరవ చూపాలని కోరుతున్న వైనం

జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని సీహెచ్‌సీ భవనంలో ఔట్‌పేషెంట్‌ సేవలు ప్రారంభించాలంటూ ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు. గతంలో ఆస్పత్రి పాతభవనం పట్టణంలో అందరికీ అందుబాటులో ఉండిందని.. ముఖ్యంగా రైల్వేస్టేషన్‌, కూరగాయల మార్కెట్‌, గంజ్‌, బస్టాండ్‌కు సమీపంలో ఉండటంతో వ్యాపారం, ఉద్యోగం, కూలీపనులు, చిరువ్యాపారాలు, కూరగాయల విక్రయాలు, గంజ్‌కు వచ్చే రైతులందరికి సౌకర్యంగా ఉండేదని చెబుతున్నారు. ఇతర పనులపై వచ్చి సైతం ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లే వారని పేర్కొంటున్నారు. కాగా గత ఏడాది మేనెలలో గంగాపురం రోడ్డులో నూతన భవనంలోకి ఆస్పత్రిని బదలాయించారు. అయితే ఈ భవనం పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉంది. దీంతో అక్కడికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటే వ్యయ ప్రయాసల వున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా విషయం గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి పాత భవనంలో ఔట్‌పేషెంట్‌ సేవలు యథావిధిగా నిర్వహిస్తామని ప్రజలకు హామీఇచ్చారు. దానికి తగ్గట్లుగానే తాత్కాలికంగా అర్బన్‌ పరిధిలోని బస్తీ దవఖానల్లో పనిచేస్తున్న డాక్టర్‌లను అందుబాటులో ఉంచి సేవలు ప్రారంభించారు. అయితే కొద్దిరోజులకే ఆ సేవలు సైతం నిలిపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నూతన భవనంకు వెళ్లాలంటే తప్పనిసరిగా ద్విచక్రవాహనం, ఆటో ఉండాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆటోలో వెళ్లాలంటే ఒకరికి రూ.40వరకు ఖర్చుచేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య సైతం తగ్గింది. పాతభవనంలో నిత్యం 700మంది వరకు ఔట్‌పేషెంట్లు చికిత్సకు వస్తుంటే నూతన భవనంలో 200–400ల మధ్యే వస్తున్నారు. ప్రస్తుతం పాతభవనంలో హోమియో క్లినిక్‌ మాత్రమే నిర్వహిస్తున్నారు. హోమియోక్లినిక్‌లో దీర్ఘకాలిక వ్యాధులకు, ముందస్తు నివారణ మాత్రలు మాత్రమే అందిస్తున్నారు. ఈ కారణంగా హోమియోపై అవగాహన ఉన్నవారు మాత్రమే క్లినిక్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు. భవనంలో చాలా గదులు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రజల అసౌకర్యాన్ని గుర్తించి పాతభవనంలో ఓపీ సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.